సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



## అర్జీల పరిష్కారానికి చర్యలు

ప్రజలు అందజేసే అర్జీలపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. 10లో



## పొట్టేళ్లకు భలే డిమాండ్

తాళ్లపాలెంలో సోమవారం జరిగిన వారపు సంతలో గొర్రెలు, మేకలకు భలే డిమాండ్ ఏర్పడింది. 10లో



## ముగిసిన నాటకోత్సవాలు

అనకాపల్లి పట్టణంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలు సోమవారంతో ముగిశాయి. 10లో

## న్యూస్‌రీల్

### జెడ్పీ సీఈవోగా నారాయణ మూర్తి బాధ్యతల స్వీకరణ



మహారాణిపేట(విశాఖ): జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో)గా పి.నారాయణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటి వరకు డీఎల్డీవోగా ఉన్న ఈయన కాకినాడ జెడ్పీ సీఈవో(ఎఫ్ఏసీ)గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పదోన్నతిపై విశాఖ జిల్లా జెడ్పీ సీఈవోగా విచ్చేశారు. జెడ్పీ అధికారులు, సిబ్బంది సీఈవో నారాయణమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు.

### ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు 15 వరకు గడువు

అనకాపల్లి: ఈ ఏడాది డిసెంబర్ 8వ తేదీన నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు హాజరుకాగోరు విద్యార్థులు ఈనెల 15 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ రసీదును ఈనెల 17వ తేదీలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బిఎస్ఈ.ఎపి.ఐఎన్‌లో చూడాలని తెలిపారు.

### ఢిల్లీ సైబర్ క్రైం పోలీసుల పేరిట సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి టోకరా

- బాధితుడి ఖాతా నుంచి రూ.11 లక్షలు బదిలీ
- 3న జిల్లా సైబర్ క్రైం పోలీసులకు సమాచారం
- రూ.6 లక్షలు హోల్డ్ చేసిన పోలీసులు

అనకాపల్లి: ఢిల్లీ సైబర్ క్రైం పోలీసులమని చెప్పి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. బాధితుడి ఖాతా నుంచి రూ.11 లక్షలు కాజేశారు. జిల్లా పోలీసులు అప్రమత్తమై రూ.6 లక్షలు హోల్డ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 1న కశింకోట మండలం జమ్మాదులపాలెం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బి.మహేశ్వరరావుకు ఢిల్లీ సైబర్ క్రైం పోలీసులమని చెప్పుకుంటూ సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. 'నీ అకౌంట్‌లో ఇప్పటి వరకూ సుమారుగా రూ.310 కోట్ల లావాదేవీలు జరిగాయని, తక్షణమే మీపై మనీ లాండరింగ్ కేసు నమోదు చేస్తున్నామని' మహేశ్వరరావును బెదిరించారు. అకౌంట్ లావాదేవీలపై విచారణ చేస్తామని, ఈ నెల 3న అనకాపల్లి విజయ రెసిడెన్సీకి రావాలని సైబర్ నేరగాళ్లు చెప్పడంతో మహేశ్వరరావు అక్కడకు చేరుకున్నారు. అయితే సైబర్ మోసగాళ్లు అక్కడికి రాకుండా వాట్సాప్ కాల్‌లో పోలీసుల యూనిఫాంలో ఆయనతో మాట్లాడారు. బెదిరించి అకౌంట్‌లో ఉన్న రూ.11 లక్షలను బదిలీ చేయించుకున్నారు. ఆ రోజు సాయంత్రం మోసపోయానని గ్రహించిన మహేశ్వరరావు వెంటనే జిల్లా క్రైం పోలీసులను ఆశ్రయించారు. హుటాహుటిన అకౌంట్‌లో ఉన్న రూ.6 లక్షలను పోలీసులు హోల్డ్ చేశారు. సోమవారం మహేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ టి.వి.విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలి

- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న
- దేవరాపల్లిలో జీడి రైతులతో కలిసి నిరసన



దేవరాపల్లిలో నిరసన తెలుపుతున్న జీడి రైతులు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న

దేవరాపల్లి: జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించి, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో సోమవారం జీడి రైతులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మద్దతు ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ జీడి రైతుల సమస్యలను పరిష్కరించే వరకు దశల వారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. జిల్లాలో జీడి ప్రధాన పంటగా ఉందని,దేవరాపల్లి, చీడికాడ, మాడుగుల, రావికమతం, రోలుగుంట, నర్సీపట్నం, గొలుగొండ,నాతవరం, కోటవురట్ల మండలాల్లో అధిక సంఖ్యలో గిరిజనులు, పేదలు జీడిపంటపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రతి ఏటా పంట చేతికి అందే సమయంలో తెగుళ్లు రావడంతో కనీసం పెట్టుబడి సొమ్ము సైతంరాక తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. కె.రాముడు, బి.వెంకటరమణ, కాదల దేముడు, కె.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి భవితవ్యానికి 'అపార్'

- ఆధార్ తరహాలో 12 అంకెల గుర్తింపు కార్డు
- వన్ నేషన్ వన్ స్టూడెంట్ విధానంలో జారీకి అధికారుల కసరత్తు
- జిల్లాలో ఇప్పటికే ప్రారంభమైన ప్రక్రియ



యలమంచిలి రూరల్: జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా ఆధార్ తరహాలో విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ నినాదంతో విద్యార్థులకు 12 అంకెలతో కూడిన అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) నంబర్‌ను కేటాయించనున్నారు. యూడైస్ ప్లస్ వెబ్‌సైట్ వేదికగా జాతీయ స్థాయిలో అపార్ నంబర్ కేటాయించి విద్యార్థికి సంబంధించిన సమస్త సమాచారం అందులో నిక్షిప్తం చేస్తారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులకు ఈ నంబర్ కేటాయించనున్నారు. జిల్లాలో మొదటగా ప్రైమరీ స్కూల్ నుంచి హయ్యర్ సెకండరీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ నంబర్ కేటాయించే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ప్రతి విద్యార్థికి పెన్(పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్) ఉంది.దీని ఆధారంగానే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడంతో పాటు టీసీలు జారీ చేస్తున్నారు.ఇకపై అపార్ ఉంటే అనకాపల్లి విద్యార్థి బెంగుళూరులోనూ,కాశ్మీర్ విద్యార్థి విశాఖపట్నంలోనూ ఇలా దేశంలో ఎక్కడైనా వెళ్లి చదువుకునే వెసులుబాటు ఉంటుంది.

**అపార్ కార్డు పొందే విధానం**

అపార్ కార్డు పొందే విద్యార్థితో పాటు తల్లి లేదా తండ్రి కచ్చితంగా విద్యాసంస్థకు వెళ్లాలి.తొలుత యూడైస్ ప్లస్‌లో నమోదైన వివరాలను వారు సరిచూసుకోవాలి.అనంతరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. దీనికి ప్రధానోపాధ్యాయుడు లేదా ప్రిన్సిపాల్ ధ్రువీకరణ తప్పనిసరి.విద్యార్థి ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది.దానిని నమోదు చేసిన అనంతరం గుర్తింపు నంబరు జారీ అవుతుంది.ఆన్‌లైన్‌లో అపార్ కార్డు ఒకసారి వెలువడితే దాని సవరణకు అవకాశం ఉండదు.కాబట్టి అన్నీ ముందే సరిచూసుకోవాలి. జిల్లాలో ముందుగా 9, 10 తరగతుల విద్యార్థులకు అపార్ కార్డుల నమోదు చేపట్టారు.అన్ని రకాల యాజమాన్యాల విద్యార్థులకు ఇది అవసరం.

**జిల్లా సమాచారం**

| | |
|---|---|
| ప్రభుత్వ పాఠశాలలు | 83 |
| జిల్లా పరిషత్ పాఠశాలలు | 1,355 |
| మున్సిపల్ పాఠశాలలు | 26 |
| ఎయిడెడ్ పాఠశాలలు | 3 |
| ప్రైవేట్ పాఠశాలలు | 416 |
| ప్రభుత్వ జూనియర్ కళాశాలలు | 20 |
| ప్రైవేట్ జూనియర్ కళాశాలలు | 73 |
| మొత్తం విద్యాసంస్థలు | 1,956 |
| మొత్తం విద్యార్థులు | 2.54 లక్షలు |





అపార్ కార్డు నమూనా

**విద్యాశాఖ కసరత్తు**

జిల్లాలో 1 నుంచి 12వ తరగతి వరకు ఉన్న 2,54,911 మంది విద్యార్థులకు అపార్ ఐడీని రూపొందించడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.దీనిలో భాగంగా తొలివిడతలో ట్రయల్ రన్‌గా 9,10 తరగతులకు అపార్ ఐడీని రూపొందించే పనిని ప్రారంభించామని జిల్లా సహాయ గణాంక అధికారి సత్యప్రసాద్ చెప్పారు.అపార్ ప్రాధాన్యంపై తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సి ఉంది.యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో విద్యార్థికి పెన్(పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్) ఉండేలా చర్యలు తీసుకోవాలి, ఆధార్ చెల్లుబాటు(వ్యాలిడేట్) అయి ఉండేలా చూడాలి.ఈ కొత్త విధానంపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. ప్రాథమిక విద్య మొదలు ఇంటర్ వరకు అపార్ ఐడీ జారీ దిశగా జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.ఈ నెల 14వ తేదీ లోగా ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు/సంరక్షకుల అనుమతి పత్రాలను తీసుకున్న అనంతరం ప్రతి విద్యార్థికీ అపార్ ఐడీ రూపొందించనున్నారు.

**ఉపయోగాలు ఇలా..**

అపార్ కార్డులో విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయి. పేరు, పుట్టిన తేదీ,జెండర్ క్యూఆర్ కోడ్,12 అంకెలతో కూడిన గుర్తింపు నంబరు అన్నీ కలిపి డిజిటల్ కార్డు రూపంలో భద్రపరుస్తారు.విద్యార్థి చదువుకు సంబంధించిన అకాడమీ సమాచారం అంటే ఎన్ని మార్కులు లేదా ఏ గ్రేడ్ వచ్చింది, ఉపకార వేతన వివరాలు, క్రీడల్లో సాధించిన విజయాలు, వ్యక్తిగత, విద్యా సంబంధిత వివరాలు ఎప్పటికప్పుడు నమోదవుతాయి. విద్యార్థికి కేటాయించిన నంబరును ఇంటర్‌నెట్‌లో అన్వేషించడం లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పూర్తి సమాచారం చిటికెలో వచ్చేస్తుంది. వివిధ విద్యా సంస్థల్లో ప్రవేశాలు,ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు,ధ్రువీకరణ సులువుగా పూర్తవుతుంది. ఉపకార వేతనాలు, ఉద్యోగాల భర్తీ,ఇంటర్వ్యూ సమయంలో ఇది కీలకం కానుంది. అకాడమీ పరంగా విద్యార్థికి జీవితకాల గుర్తింపుగా పరిగణిస్తారు.విద్యార్థి వివరాలన్నీ డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉండడంతో ఆ వివరాలన్నింటినీ ఉద్యోగాల భర్తీ,ఇతర కీలక సమయాల్లో ప్రామాణికంగా తీసుకుంటారు.



కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ రూపొందించిన అపార్ పోర్టల్

**అపార్‌తో ఎన్నో ప్రయోజనాలు**



విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించే దిశగా విద్యాసంస్థల నిర్వాహకులకు సూచిస్తున్నాం.అపార్ ఐడీ క్రియేట్ చేసేటప్పుడు పాఠశాలల్లో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే విద్యాశాఖ కార్యాలయంలో గణాంక అధికారిని సంప్రదించాలి.అపార్ కార్డు జారీ వల్ల విద్యార్థులకు ఎన్నో ఉపయోగాలుంటాయి. తల్లిదండ్రులు చొరవ చూపాలి.

– ఎం.వెంకటలక్ష్మమ్మ,జిల్లా విద్యాశాఖాధికారి

## ఆంజనేయ, గరుడ వాహనాలపై వెంకన్న తిరువీధి



తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ఉపమాకలో జరుగుతున్న కల్కి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఆంజనేయ వాహనం పైన, రాత్రి లక్క గరుడ వాహనం పైన శ్రీదేవి భూదేవి సమేత కల్కివెంకటేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి తిరువీధి సేవలు నిర్వహించారు. ఆలయంలో నిత్య పూజలు నిర్వహించిన తరువాత విశేష ప్రసాద నివేదనలు, ప్రత్యేక హోమాలు జరిపి, సుదర్శన పెరుమాళ్ వారిని పల్లకిలో వేంచేపుచేసి బలిహరణలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తులను ఆంజనేయవాహనంపై అధిష్ఠింపజేసి నాలాయిర సేవా కాలములతో గ్రామ తిరువీధిసేవ నిర్వహించారు.సాయంత్రం నిత్య పూజలు విశేష ప్రసాద నివేదనలు, హోమాలు నిర్వహించిన తర్వాత సుదర్శన పెరుమాళ్ల వారిని పల్లకిలో వేంచేపుచేసి గ్రామబలిహరణలు నిర్వహించారు. రాత్రి లక్క గరుడ వాహనంపై తిరువీధి జరిపారు.

- శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం 5.30 గంటలకు గోదాదేవి అమ్మవారి ఆలయంలో లక్ష్మీ సహస్రనామ అష్టోత్తర శతనామ కుంకుమ పూజలు నిర్వహించారు.

## కేజీహెచ్ ఏడీకి పదోన్నతి



ఏడీ శ్రీనివాస్ కుమార్

మహారాణిపేట(విశాఖ): కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ (పరిపాలన) సీహెచ్.శ్రీనివాస్ కుమార్‌కు పదోన్నతి లభించింది. శ్రీకాకుళంజిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డిప్యూటీ డైరెక్టర్(పరిపాలన)గా నియమించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టీ.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

# ఎమ్మెల్యే కొణతాలపై మాటల 'దాడి'

- ఇరువురి మధ్య మరోసారి భగ్గుమన్న విభేదాలు
- టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో తీవ్ర విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న దాడి వీరభద్రరావు

సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి నియోజకవర్గంలో టీడీపీ–జనసేన మధ్య విభేదాలు బయటపడ్డాయి. సుదీర్ఘ రాజకీయాల్లో శత్రువులుగా విమర్శలు చేసుకునే కొణతాల రామకృష్ణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావుల మధ్య స్నేహం పట్టుమని మూడు నెలలు కూడా లేనట్టుగానే స్పష్టమైంది. సోమవారం అనకాపల్లి టౌన్‌లో గవరపాలెంలో జరిగిన టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణపై దాడి వీరభద్రరావు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. టీడీపీ వేదికగా జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణపై మాజీ మంత్రి, టీడీపీ నేత దాడి వీరభద్రరావు మాటల దాడికి దిగారు. దాడి వీరభద్రరావు మాట్లాడుతున్నంతసేపూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజిల్స్, కేకలు వేశారు. దీంతో అనకాపల్లి నియోజకవర్గంలో మరోమారు టీడీపీ వెర్సెస్ జనసేనగా మారింది.

**జనసేన ప్రభుత్వం కాదు.. కూటమి ప్రభుత్వం**

అనకాపల్లి నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అల్లుడు చెప్పిందే వేదంగా మారిందంటూ దాడి వీరభద్రరావు విరుచుకుపడ్డారు. అనకాపల్లిలో జనసేన ప్రభుత్వం నడుస్తుందా..? లేదంటే కూటమి ప్రభుత్వం నడుస్తుందా..? కొణతాల రామకృష్ణ అల్లుడు రాజకీయం చేయడమేంటి..? అని మండిపడ్డారు. కూటమిలో భాగంగా ఎన్నికల్లో సీటు జనసేనకు వచ్చిందని, టీడీపీ నుంచి పీలా గోవింద్ సత్యనారాయణ సీటును త్యాగం చేశారని, అందరం కలిసికట్టుగా పని చేశామన్నారు. కానీ అనకాపల్లిలో జనసేన ఎమ్మెల్యే కుటుంబం పాలిస్తోందన్నా రు. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం నడుస్తోందని, ఇందులో ప్రధాన పార్టీ టీడీపీ అనే విషయాన్ని మరిచిపోవద్దన్నారు. తాను గతంలో కలెక్టర్‌ను కలిసి ఇదే విషయం చెప్పానని, టీడీపీ నేతలు చెప్పిన విధంగానే నడుచుకోవాలని తెలిపానన్నారు. కలెక్టర్‌తో పాటు వివిధ విభాగాల్లో ఉన్న అధికారులంతా జనసేన ఎమ్మెల్యే, వారి కుటుంబ సభ్యులు చెప్పినట్లే వింటున్నారు తప్ప టీడీపీ నేతలు చెప్పినట్టు వినడం లేదని మండిపడ్డారు. దీనికి ఏపీఎఫ్ఐడీ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ,రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్,టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్‌లు మద్దతు పలికారు.

**జనసేనకు చెక్ పెట్టేందుకే... :** జిల్లాలో జనసేన ఎమ్మెల్యేలు గెలిచిన చోట వారికి చెక్ పెట్టేందుకే టీడీపీ సరికొత్త వ్యూహంగా మాటల దాడి చేయిస్తోందని జనసైనికులు చర్చించుకుంటున్నారు. గతంలో పోలీసులు, రెవెన్యూ అధికారుల బదిలీల విషయంలో జనసేన ఎమ్మెల్యేల సిఫారసులను పట్టించుకోలేదు. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతో సహా మరో ఇద్దరు జనసేన ఎమ్మెల్యేలు గన్‌మెన్‌లను సరెండర్ చేస్తామని ప్రకటించారు. జనసేన ఎమ్మెల్యే ఉన్నచోట టీడీపీ నుంచి ప్రత్యేక గ్రూప్‌ను ఏర్పాటు చేసి పరోక్షంగా జనసేనకు చంద్రబాబు చెక్‌పెడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

# మహిళా అధికారికి తీవ్ర అవమానం!

- కొత్త డీపీవో బదిలీ ఆర్డర్ తిరస్కరించిన జిల్లా ఉన్నతాధికారి
- కమిషనరేట్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశం
- కూటమి నేతల సూచనలతోనే...

సాక్షి, అనకాపల్లి: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మంత్రిగా ఉన్న పంచాయతీ శాఖలో ఒక మహిళా అధికారికి తీవ్ర పరాభవం ఎదురైంది. పంచాయతీ అధికారిగా బదిలీపై అనకాపల్లికి వచ్చిన ఆమె జాయినింగ్ ఆర్డర్‌ను జిల్లా ఉన్నతాధికారి తిరస్కరించారు. దీంతో జిల్లాలో ఈవోపీఆర్‌డీల బదిలీల్లో అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలున్న ప్రస్తుత జిల్లా పంచాయతీ అధికారిణి కాపాడేందుకు, ఆమెనే ఆ సీట్లో కొనసాగించేందుకు కూటమి ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లతో కలెక్టర్ ఏకంగా ప్రభుత్వ ఉత్తర్వులనే ధిక్కరించారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని కూటమి ప్రజాప్రతినిధులకు అనుకూలమైన వారొస్తే అంగీకరిస్తూ, కానివారి జాయినింగ్ ఆర్డర్లను ఇక్కడి జిల్లా అధికారులు తిరస్కరిస్తున్నారు. దీంతో బాధిత అధికారులు రాష్ట్ర పంచాయతీ ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నారు. తాజాగా ఇక్కడికి వచ్చిన డీపీవో జాయినింగ్ ఆర్డర్ తిరస్కరించడంతో ఇక్కడ విధుల్లో చేరలేక, సొంత ప్రాంతానికి వెళ్లలేక సంకటస్థితిలో ఉన్నారు.

**కూటమి నేతల ఒత్తిడితోనే...**

కూటమి ప్రజా ప్రతినిధులకు జిల్లా ఉన్నతాధికారులు సైతం భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. డీపీవోగా అనకాపల్లికి బదిలీపై వచ్చిన అధికారిణికి కూటమి నేతల ఒత్తిళ్ల కారణంగా తీవ్ర అన్యాయం జరిగింది.గత నెల 22న రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన డీఎల్‌డీవో, డీపీవో బదిలీల్లో అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారిగా శాంతామణిని నియమించారు. ఆమె కొవ్వూరులో డీఎల్‌డీవోగా విధులు నిర్వహిస్తున్నారు. బదిలీ ప్రక్రియలో భాగంగానే ఈ నెల 5వ తేదీ శనివారం అక్కడకు కొత్త డీఎల్‌డీవో వచ్చి చేరడంతో.. శాంతమణి అక్కడ రిలీవ్ అయ్యారు. అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారిగా రిపోర్టు చేయడానికి ఆమె సోమవారం వచ్చారు. అయితే ఆమె తీసుకొచ్చిన ఆర్డర్ నిబంధనలకు విరుద్ధంగా ఉందని పేర్కొంటూ జిల్లా ఉన్నతాధికారి తిరస్కరిస్తూ, కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని చెప్పడంతో ఆమె అవమానంతో తిరుగు పయనమయ్యారు. ఇటీవల ఈపీఆర్‌డీ బదిలీల విషయంలో అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న అనకాపల్లి డీపీవో శిరీషరాణిని కాపాడేందుకు రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం జిల్లా అధికారులు బేఖాతరు చేశారని స్థానికంగా విమర్శలు వినిస్తున్నాయి.

## రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ విజేత విశాఖ

- బాలురు, బాలికల విభాగాల్లో ప్రథమ స్థానం



రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌లో విజయం సాధించిన బాలురు జట్టు



రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌లో విజయం సాధించిన బాలికల జట్టు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం నునపర్తిలో నిర్వహించిన 9వ రాష్ట్ర స్థాయి జూనియర్ అండర్–19 బాల,బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారంతో ముగిశాయి. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ నిర్వహణలో జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. బాలుర విభాగంలో శ్రీకాకుళం జట్టుపై విశాఖ జట్టు, బాలికల విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్టుపై విశాఖ జట్టు విజయం సాధించి ప్రథమ స్థానాలు కైవసం చేసుకున్నాయి. డిసెంబర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు సంబంధించిన రాష్ట్ర జట్టును రాష్ట్ర సంఘ కార్యదర్శి ఆర్.వెంకటరావు ప్రకటించారు. పోటీల్లో విజేతలకు స్పెషల్ మెట్రో పాలిటిన్ రిటైర్డ్ జడ్జి పైలా సన్నిబాబు బహుమతులు అందజేశారు. ఉత్తరాంధ్ర బీసీ సంఘ అధ్యక్షులు నరవ రాంబాబు,బాల్ బ్యాడ్మింటన్ అఖిలభారత సమాఖ్య జనరల్ కార్యదర్శి వై.రాజారావు,రాష్ట్ర సంఘ అధ్యక్ష,కార్యదర్శులు వై.విజయశంకర రెడ్డి, ఆర్.వెంకటరావు,ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ఆర్.వి.వి.నగేష్, పరవాడ మండల పరిషత్ మాజీ అధ్యక్షులు మాసవరపు అప్పలనాయుడు.జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.ప్రభుజీ,ప్రధాన కార్యదర్శి గొంప నరసింహనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదపూడి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ముగిసిన తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలు

**తుమ్మపాల:** పట్టణంలోని గవరపాలెం కనకదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక గౌరీ సేవా సంఘం మల్ల జగన్నాథం కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలు సోమవారంతో ముగిశాయి. జయ కళానికేతన్ విశాఖ వారి శ్రీకాంత్ కృష్ణమాచార్య నాటక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో నాటక ఉత్సవాల విరాళ దాత కర్రి సన్యాసినాయుడు, కనకదుర్గమ్మ ఆలయ వ్యవస్థాపకుడు పి.వి. రమణ, కనకదుర్గమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

### నేడు స్టీల్‌ప్లాంట్‌పై ఢిల్లీలో కీలక సమావేశం

**సాక్షి, విశాఖపట్నం:** విశాఖ స్టీల్‌ప్లాంట్ భవితవ్యంపై మంగళవారం ఢిల్లీలో కీలక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో తీసుకోబోయే నిర్ణయంపై స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం తర్వాత స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నాయి. వివిధ రాజకీయ పార్టీల నేతలను కలిసి ప్రైవేటీకరణ ఉపసంహరించాలని, స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, ముడిసరకుల హామీ కోసం సెయిల్‌లో విలీనం చేయాలని, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. అదే విధంగా ఉద్యోగుల హెచ్‌ఆర్‌ఏ నిలిపివేత, విద్యుత్ చార్జీల పెంపుదల వంటి అంశాలను వారి దృష్టికి తీసుకొచ్చాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు ఎంపీ భరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ హాజరవుతున్నట్టు సమాచారం. సమావేశంలో తమ భవిష్యత్తు కోసం తీసుకునే నిర్ణయంపై ఉద్యోగులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

### బస్సు ఢీకొని వృద్ధురాలి దుర్మణం

**పద్మనాభం:** మండలంలోని అనంతవరంలో సోమవారం బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందినట్టు ఎస్‌ఐ జె.సురేష్ తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాలా ఉన్నాయి. అనంతవరం నుంచి కొత్త కొవ్వాడ వెళుతున్న 222-కె ఆర్టీసీ బస్సు అనంతవరం సమీపంలోని పైడితల్లమ్మ ఆలయం వద్ద రోడ్డుపై నడిచి వెళుతున్న పెంట గ్రామానికి చెందిన దేవరాపల్లి కన్నమ్మ (78) ను ఢీకొట్టింది. కన్నమ్మ తల మీద నుంచి బస్సు వెనుక టైరు వెళ్లిపోయింది. తల నుజ్జునుజ్జుకావడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

# అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు

- కలెక్టర్ విజయ క్రిష్ణన్
- పీజీఆర్ఎస్ 232 అర్జీలు

**తుమ్మపాల:** ప్రజలు అందజేసే అర్జీలపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి ఆమెతో పాటు జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ అర్జీలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. కొన్నింటికి స్పష్టమైన సమాధానం అందించాలన్నారు. అర్జీదారు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపితే అర్జీలు పునరావృతం కావన్నారు.



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ క్రిష్ణన్, జేసీ జాహ్నవి

రెవెన్యూ సంబంధిత అర్జీలపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి పరిష్కారం చేయాలన్నారు. జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ వారం మొత్తం 232 అర్జీలు రాగా, అధిక సంఖ్యలో ప్రజలు వ్యక్తిగత, సామాజిక అంశాలపై వినతులు సమర్పించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### నడవలేని స్థితిలో ఉన్న నన్ను ఆదుకోవాలి



కిడ్నీ తొలగించడంతో రెండు కాళ్లు చచ్చుబడి నడవలేని స్థితిలో ఉన్న తనకు పింఛను మంజూరు చేసి జీవనాధారం కల్పించాలి. చోడవరం మండలం ముద్దుర్తి గ్రామానికి చెందిన బి.మాణిక్యం కర్ర సాయంతో కలెక్టరేట్‌కు చేరుకున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే తనకు నరాల బలహీనత సమస్యతోపాటు కిడ్నీ పాడవడంతో తొలిగించారు. దీంతో రెండు కాళ్లు పనిచేయక మంచానికే పరిమితమయ్యాను. న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరాడు.

### పింఛను మంజూరు చేయాలి



బోదకాలుతో నడవలేని నాకు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలి. కొంత కాలంగా ఎడమ కాలికి బోద వ్యాధి రావడంతో పాటు అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. అవగాహన లేకపోవడంతో సదరం క్యాంపునకు వెళ్లలేకపోయాను. సచివాలయానికి వెళ్తే రెండు కాళ్లకు బోద వ్యాధి వస్తే పింఛను వస్తుందని చెబుతున్నారు. నిరుపేదరాలినైన నా అనారోగ్య పరిస్థితులను పరిశీలించి పింఛను మంజూరు చేయాలని పీజీఆర్ఎస్‌లో అర్జీ పెట్టుకుంది.

– వేమలపూరి చిన్నారి, నాతవరం గ్రామం, మండలం

### రేషన్ కార్డులో పేరు తొలగించారు...



మూడేళ్ల క్రితం ఏ కారణం లేకుండా రేషన్ కార్డులో నా పేరు తొలగించారు. దీంతో బియ్యం కూడా ఇవ్వడం లేదు. నా పేరును మా కుటుంబ రేషన్‌కార్డులో చేర్చాలి. నా పేరును సచివాలయ సిబ్బందే తొలగించారు. వ్యవసాయ పనులు చేసుకుంటున్న నేను సచివాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవడం లేదు. అధికారులు విచారణ చేసి నా పేరును తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను.

– బొల్లి రాంబాబు, గొబ్బూరు గ్రామం, కశింకోట మండలం

# ఎస్పీ కార్యాలయానికి 33 అర్జీలు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ దీపిక

**అనకాపల్లి:** ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33 అర్జీలు వచ్చాయి. ఎస్పీ ఎం.దీపిక అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్టపరిధిలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. ఆస్తితగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర అంశాలపై అర్జీలు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# గాజాపై దాడులు ఆపాలని సీపీఎం ధర్నా

**అనకాపల్లి:** పాలస్తీనాలోని గాజాపై ఇజ్రాయెల్ ఆటవిక దాడులు మొదలు పెట్టి ఏడాదవుతున్న తరుణంలో తక్షణమే ఈ యుద్ధాన్ని ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దాడులకు వ్యతిరేకంగా సోమవారం స్థానిక నెహ్రూ చౌక్ వద్ద ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గతేడాది అక్టోబర్ 7న హమాస్ దాడికి ప్రతీకారంగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ విచక్షణా రహితంగా క్రూరమైన దాడులకు దిగిందన్నారు. ఫలితంగా 42 వేల మందికిపైగా పాలస్తీనీయులు మృత్యువాతపడ్డారని, వాస్తవానికి ఈ సంఖ్య ఈ ఏడాది ఆగస్టు 6 నాటికి 85 వేలకు పైగా ఉండవచ్చని మెడికల్ జర్నల్ లాన్సింగ్ అంచనా వేసినట్లు పేర్కొన్నారు. సీపీఐ జిల్లా నాయకుడు వై.ఎన్. భద్రం మాట్లాడుతూ గాజాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధాన్ని ప్రపంచ దేశాలు ఆపేందుకు ప్రయత్నించాలని కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, అల్లు రాజు, డివిజన్ నాయకుల గంటా శ్రీరామ్, పి.శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు, సీపీఐ నాయకులు కోరిబిల్లి శంకరరావు, కొల్లి సత్యారావు, బుగిడి నూక అప్పారావు, మంద రాము పాల్గొన్నారు.



సీపీఎం ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ వద్ద ధర్నా

# బకాయి జీతాలు చెల్లించాలని వినతి

**అనకాపల్లి:** జిల్లా విద్యా శాఖలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆగస్టు, సెప్టెంబర్ నెలల జీతాలు, సమ్మెకాలంలో వేతనం చెల్లించాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(జేఏసీ) జిల్లా నాయకులు టి.కృష్ణ, పి.సతీష్, పి.వెంకటరావు కోరారు. స్థానిక జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఫైనాన్స్ అండ్ అకౌంట్ ఆఫీసర్ (ఎఫ్ఏవో) కె.జోగినాయుడుకు సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని 22 రోజులు సమ్మె చేశారని, అప్పటి కూటమి నాయకులు సమ్మెకు మద్దతు పలికారన్నారు. కూటమి అధికారం చేపట్టిన వెంటనే సమస్యలు పరిష్కరించి, జీతాలు ఇస్తామని చెప్పిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జేఏసీ సభ్యులు నాగేశ్వరరావు, వరప్రసాద్, లక్ష్మీనారాయణ, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.



ఎఫ్ఏవో జోగినాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ నాయకులు

# శస్త్ర చికిత్స లేకుండానే బ్రెయిన్ స్ట్రోక్‌కు వైద్యం

- విమ్స్ డైరెక్టర్ రాంబాబు

**ఆరిలోవ:** విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నట్లు డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. విమ్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన 69 ఏళ్ల సీహెచ్ జగన్నాథరావుకు శస్త్ర చికిత్స లేకుండానే మందులతో నయం చేసినట్లు తెలిపారు. న్యూరో మెడిసిన్ వైద్యులు ఆయనకు చికిత్స అందించి రూ.55 వేల ఖరీదైన ఇంజక్షన్‌ను ఉచితంగా ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో ఆయన వారం రోజుల్లో పూర్తిగా కోలుకున్నాడన్నారు. ఈ విధంగా చికిత్స అందించడం రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులలో ఇదే మొదటిదన్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైనవారికి మూడు గంటలు గోల్డెన్ సమయమన్నారు. ఆ సమయంలో వైద్యులను సంప్రదించాలన్నారు. దానికి సంబంధించిన వైద్య సేవలు విమ్స్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. దీంతో పాటు ఇక్కడ మూడు నెలల్లో 1,016 ఎండోస్కోప్‌లు జరిగినట్లు తెలిపారు. ఎండోస్కోపిక్, కొలనోస్కోపీ, ఈఆర్‌సీపీ, ఎండో అల్ట్రాసోనోగ్రఫీ తదితర వాటిని చేయించడానికి ప్రైవేట్, కార్పొరేటర్ ఆస్పత్రులలో రూ.3 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చవుతుందన్నారు.



బ్రెయిన్‌స్ట్రోక్ నుంచి కోలుకున్న వృద్ధుడితో కలిసి మాట్లాడుతున్న విమ్స్ డైరెక్టర్ రాంబాబు

విమ్స్‌లో మాత్రం అవన్నీ ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగంలో క్లిష్టమైన సర్జరీలు జరుగుతున్నాయన్నారు. లాప్రోస్కోపీ ద్వారా లివర్ అండ్ బేరియాట్రిక్ తదితర సర్జరీలు జరుగుతున్నాయన్నారు. విమ్స్‌లో వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 22న విమ్స్‌లో బ్రెస్ట్ క్యాన్సర్‌కు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మెమోగ్రఫీ పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. సమావేశంలో న్యూరో విభాగం వైద్యులు పాల్గొన్నారు.

# పొట్టేళ్లకు భలే డిమాండ్

- తాళ్లపాలెం సంతకు దసరా శోభ
- 1500 మేకలు, గొర్రెల అమ్మకాలు

**కశింకోట:** మండలంలోని తాళ్లపాలెంలో సోమవారం జరిగిన వారపు సంతలో గొర్రెలు, మేకలకు భలే డిమాండ్ ఏర్పడింది. విజయదశిమి సందర్భంగా పెద్ద ఎత్తున క్రయవిక్రయాలు జరిగాయి సుమారు 1500 మేకలు, గొర్రెలను అమ్మకానికి తీసుకువచ్చారు. రూ. కోటికిపైగా లావాదేవీలు జరిగాయి. జిల్లాలోనే పెద్ద సంతలో ఒకటిగా పేరొందిన ఇక్కడికి విశాఖ జిల్లాతోపాటు కాకినాడ జిల్లా నుంచి అధిక సంఖ్యలో గొర్రెలు, మేకలను వ్యాపారులు, పెంపకందారులు అమ్మకానికి తీసుకు వచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు,కొనుగోలు దారులు వీటిని కొనుగోలు చేసి వ్యాన్లు, ఆటోల్లో తరలించారు.అచ్యుతాపురం మండలం వెదురువాడకు చెందిన రైతు మేకపోతు ఏకంగా రూ.38 వేలు అత్యధిక ధర పలికింది. దీన్ని కత్తిపూడికి చెందిన వ్యక్తి కొనుగోలు చేశాడు. ఇక మిగిలిన మేకలు, గొర్రెలు సైజు బట్టి రూ.5 వేలు నుంచి రూ.30 వేలు వరకు అమ్మకాలు సాగాయి. రూ.లక్షల్లో వ్యాపారం జరిగింది. గత వారం కంటే అధిక సంఖ్యలో గొర్రెలు, మేకలను సంతకు తీసుకురావడంతో సంత ప్రాంగణం పూర్తిగా నిండిపోవడంతో పాటు తాళ్లపాలెం-నర్సీపట్నం రోడ్డుపైన కూడా అమ్మకాలు సాగాయి. కొనుగోలుదారులు, అమ్మకందారులు తెచ్చిన వాహనాలతో రోడ్డు రెండు వైపులా రద్దీగా మారి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం పోలీసులకు తలకు మించిన భారంగా పరిణమించిది.



నర్సీపట్నం నుంచి అమ్మకానికి వచ్చిన పొట్టేళ్లు

# 'విద్యార్థి మేలుకో' కార్యక్రమానికి శ్రీకారం

- వినూత్నంగా చేపట్టిన గణిత ఉపాధ్యాయుడు

**కశింకోట:** మండలంలోని వెదురుపర్తి హైస్కూలు గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఎ.వి.ఎస్ మూర్తి సోమవారం వినూత్నంగా 'విద్యార్థి మేలుకో' కార్యక్రమాన్ని చేపట్టారు. టెన్త్ చదువుతున్న విద్యార్థుల ఇళ్లను ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు సందర్శించి వారిని లేపి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రోత్సహించి, చదువు తీరును పరిశీలించారు. గణితం పాఠ్యాంశంలో అర్థం కాని అంశాలను నివృత్తి చేశారు. పౌష్టికాహారం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించి ఆరోగ్యవంతంగా ఉండడానికి పండ్లు, ఎండు ఖర్జూరం, బాదం వగైరా తన సొంత ఖర్చుతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మూర్తి మాట్లాడుతూ పదవ తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే ఆశయంతో విద్యార్థి మేలుకో కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమం ఈ విద్యా సంవత్సరం ముగిసే వరకు కొనసాగించనున్నట్టు తెలిపారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఉపాధ్యాయుడికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



ఇళ్లకు వెళ్లి పాఠ్యాంశంలో అనుమానాలు నివృత్తి చేస్తున్న గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు మూర్తి

### గంజాయి మత్తులో యువకుల వీరంగం

**నర్సీపట్నం:** గంజాయి మత్తులో ఉన్న నలుగురు యువకులు పట్టణంలో సోమవారం వీరంగం సృష్టించారు. గంజాయి మత్తులో ఉన్న నలుగురు యువకులు మెయిన్ రోడ్డుపై బైక్‌పై రేష్‌గా వెళ్తూ స్థానికులను భయాందోళనకు గురిచేశారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై తిరగబడి చేయి చేసుకున్నారు. అడ్డొచ్చిన వారిపై దాడి చేసేందుకు యత్నించారు. యువకుల వీరంగం కారణంగా జనాలు గుమిగూడడంతో నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సుమారు అరగంటకు పైగా యువకులు హల్‌చల్ చేసి అందరినీ హడలెత్తించారు.

### కుమార్తె మృతిని తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య

**పద్మనాభం:** కుమార్తె మృతిని తట్టుకోలేక మద్యానికి బానిసైన తండ్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పద్మనాభం ఎస్‌ఐ జె.సురేష్ అందించిన వివరాలు. మండలంలోని బాందేవుపురానికి చెందిన బోనెల సింహాద్రి కుమార్తె కోటలక్ష్మి నాలుగు నెలల క్రితం పాముకాటుకు గురై మృతి చెందింది. కుమార్తె మృతితో తీవ్ర మనోవేదనకు గురైన తండ్రి బోనెల సింహాద్రి(41) మద్యానికి బానిసై ఈ నెల 4వ తేదీన పురుగుల మందును తాగాడు. దీంతో అతన్ని కుటుంబ సభ్యులు విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 4 గంటల సమయంలో మృతి చెందాడు. దీనిపై ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### పాముకాటుతో చిన్నారి మృతి



**తుమ్మపాల:** అనకాపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన పచ్చికూర బాబూరావు, లక్ష్మి దంపతుల కుమార్తె కుందన(4) పాముకాటుతో మృతి చెందింది. సోమవారం తెల్లవారుజామున ఇంట్లోకి వచ్చిన పాము చిన్నారి తలపై కాటేసింది. దీంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించారు. ఇంతలోనే మృతి చెందింది. తల్లిదండ్రులతోపాటు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

### విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

**నక్కపల్లి:** మండలంలో నక్కపల్లి గ్రామానికి చెందిన ఏ లక్ష్మీనారాయణమ్మ సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. నక్కపల్లిలోని ఉపమాక రోడ్డులో ఆమెకు ఇల్లు, షాపు ఉన్నాయి. ఉదయం షాపు తీసి బయటకు వెళ్లింది. తిరిగి షాపులోకి వస్తూ ఇనుప డోర్ ముట్టుకోగానే కరెంటు షాక్ కొట్టి మరణించింది. మృతురాలి కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



మృతురాలు లక్ష్మీనారాయణమ్మ (ఫైల్)

### అదృశ్యమైన వృద్ధుడు అనుమానాస్పద మృతి

**అచ్యుతాపురం(మునగపాక):** ఇటీవల అదృశ్యమైన వృద్ధుడు సోమవారం శవమై కనిపించాడు. అచ్యుతాపురం మండలం పూడిమడక పంచాయతీ పెద్దూరుకు చెందిన ఎరిపల్లి మహాలక్ష్మి(72) మృతదేహం సోమవారం బయటపడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పూడిమడక శివారు పెద్దూరుకు చెందిన మహాలక్ష్మి గత నెల 29న ఇంటి వద్ద టీ తాగి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనపై అచ్యుతాపురం పోలీసులకు ఈనెల 4న బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. వృద్ధుడు అదృశ్యం కింద కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. పెద్దూరు సమీపంలో ఓ వ్యక్తికి సంబంధించిన ఎముకలతో కూడిన ఆనవాళ్లు కనిపించడంతో పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. ఈ మేరకు అచ్యుతాపురం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఇటీవల అదృశ్యమైన వృద్ధుడి మృతదేహంగా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మహాలక్ష్మి మృతికి సంబంధించి విచారణ చేపడుతున్నామని పోలీసులు తెలిపారు.



మహాలక్ష్మి(ఫైల్)

# నిధి పోర్టల్ ద్వారా ఏపీజీఎల్ఐ సేవలు

- ఏపీజీఎల్ఐ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మి

**మహారాణిపేట:** నిధి పోర్టల్ ద్వారా ఏపీజీఎల్ఐ (ఆంధ్రప్రదేశ్ సాధారణ జీవిత బీమా) సేవలను పొందాలని ఉమ్మడి విశాఖ జిల్లా ఏపీజీఎల్ఐ సంయుక్త సంచాలకులు ఎం. ఝాన్సీలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ, అనకాపల్లి , అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు ఏపీజీఎల్ఐ జీవిత బీమా సేవలు అందిస్తోందని గుర్తు చేశారు. దానిలో భాగంగా మే నెల 24 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఈ సేవలు ఆఫ్‌లైన్ నుంచి నిధి పోర్టల్‌కు బదలాయింపు జరిగాయని, ఈ విషయాన్ని పాలసీదారులు గుర్తించాలని సూచించారు. మే 24 నుంచి నేటి వరకు ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో గల ఏపీజీఎల్ఐ పాలసీదారులకు చెందిన 1,368 పరిణితి, మరణ క్లైంలు, 503 రుణ దరఖాస్తులను ఆమోదించి వారి డీడీవోల నిధి పోర్టల్ లాగిన్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. డీడీవోలు నిధి పోర్టల్ లాగిన్‌కు వచ్చిన ఆమోదిత క్లైయింలు, రుణ చెల్లింపుల కొసం సీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లు జనరేట్ చేసి, సబ్మిట్ చేయవలసి ఉందన్నారు. అదేవిధంగా ఉద్యోగి బేసిక్ పే శ్లాబ్ రేట్ ప్రకారం మొదటి పాలసీ బాండ్‌ను వారి కార్యాలయ డీడీవో నిధి లాగిన్‌లో మాత్రమే జనరేట్ చేయాలని వారి ప్రీమియంను మొదట నెల జీతం బిల్లులో రికవరీ చేయాల్సి ఉంటుందన్నారు.

అలాగే ఏపీజీఎల్ఐ కార్యాలయం త్వరలోనే జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమర్షియల్ కాంప్లెక్స్ భవనానికి మారనుందని పేర్కొన్నారు.

# గంజాయి తరలిస్తున్న ఏడుగురి అరెస్టు

- 40 కేజీల గంజాయి, కారు, బైక్ స్వాధీనం

**నర్సీపట్నం:** గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేశామని రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ఎస్సై రాజారావు తన సిబ్బందితో కలిసి చింతపల్లి రోడ్డు సాధుపాకల జంక్షన్ వద్ద సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సమీప పొలం గట్లు మీదుగా నిందితులు మూట తీసుకెళ్తుండగా గమనించి, వెంబడించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 22 కిలోల గంజాయితోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఒడిశాకి చెందిన రశ్మిరంజన్ సాహు, జి.మాడుగుల మండలం బురిడి గురుమూర్తి, తమిళనాడుకు చెందిన అరుముగం సురేష్ కుమార్, బాల సుబ్రహ్మణ్యన్ ముత్తుకుమార్ ఉన్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఒడిశా బోర్డర్‌లో కొనుగోలు చేసిన గంజాయిని తమిళనాడుకు తరలిస్తున్నట్టు విచారణ వెల్లడైందని సీఐ తెలిపారు.



పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

### గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

**దేవరాపల్లి:** ఏజెన్సీ నుంచి కారులో గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను దేవరాపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ముందస్తు సమాచారం మేరకు స్థానిక ఎస్‌ఐ టి. మల్లేశ్వరరావు తన సిబ్బందితో కలిసి సోమవారం రైవాడ పంచాయతీ శివారు శ్రీరాంపురం వై. జంక్షన్ వద్ద మాటు వేశారు. ఈ క్రమంలో ఏజెన్సీ నుంచి వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా 40 కేజీల గంజాయి పట్టుబడింది. గంజాయిని సీజ్ చేసి, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా నందపూర్ మండలం, హికుంపూట్ పంచాయతీ నీలాదోరపూట్ గ్రామానికి చెందిన మోహన్ బైరాగి, పద్మన్ కెముండీ, మధ్యప్రదేశ్‌లోని అనుక్‌పూర్ జిల్లా కోట్మా గ్రామానికి చెందిన అతుల్ సోని ఉన్నారు. ఆంధ్రా ఒడిశా బోర్డర్(ఏవోబీ)లో కొనుగోలు చేసిన గంజాయిని దేవరాపల్లి మీదుగా ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు తరలించేందుకు ప్లాన్ చేసుకున్నారు. దీనిలో భాగంగా వీరిలో ఒకరు బైక్‌పై ముందుగా ప్రయాణించి రూట్ క్లియరెన్స్ ఇచ్చి కారులో తరలిస్తుండగా పట్టుకున్నారు. కారు, బైక్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



గంజాయితో పట్టుబడిన నిందితులతో ఎస్‌ఐ మల్లేశ్వరరావు, సిబ్బంది

## క్లుప్తంగా

### సెంచరీ కొట్టిన టమాటా

**కశింకోట:** తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయల ధరలు ఘాటెక్కాయి. టమాటా సెంచరీకి చేరుకుంది. గత వారం కిలో టమాటా రూ.70 ఉండగా, ఈ వారం రూ.వందకు పెరిగింది. పాదు చిక్కుడుకాయ బెట్టు మీదే ఉంది. కిలో రూ.150కి విక్రయించారు. ఇది రూ.120 నుంచి అదనంగా రూ.30 పెరిగింది. బంగాళదుంప రూ.40, ఉల్లిపాయ రూ.50, బీరకాయ, బీట్‌రూట్, క్యారెట్, బెండకాయ, బరబాటి రూ.60, గోరు చిక్కుడు రూ.80, క్యాప్సికం రూ.వందకు విక్రయాలు సాగాయి. దసరా సందర్భంగా కోళ్ల అమ్మకాలు, వస్త్రాల అమ్మకాలు జోరుగా సాగాయి.

### శ్మశాన వాటిక స్థల ఆక్రమణలపై ఫిర్యాదు

**కశింకోట:** బయ్యవరంలో బ్రాహ్మణ, వైశ్య కుటుంబాలకు కేటాయించిన శ్మశాన వాటిక స్థలాన్ని రైతుల ఆక్రమణల నుంచి తొలగించి అప్పగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయా కులాల సంఘం ప్రతినిధి కె. వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. సర్వే నంబర్ 71లో 12 సెంట్లు రుద్రభూమికి కేటాయించగా, దాన్ని కొంతమంది రైతులు ఆక్రమించుకున్నారన్నారు. దీనివల్ల తమ కులాల కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియలకు అవకాశం లేకపోతుందని వాపోయారు. అక్కడ ఏలేరు కాలువ ఒడ్డున గాని, విసన్నపేట రోడ్డు మార్గంలో గాని గత్యంతరం లేక అంత్యక్రియలు చేయాల్సి వస్తోందన్నారు. దీని దృష్ట్యా సర్వే చేసి రుద్రభూమి స్థలాన్ని అప్పగించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు.

### జిల్లా కార్యదర్శిగా నరసింహారావు

**కశింకోట:** తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సూపర్ వైజర్‌గా పని చేస్తున్న కె.ఎస్.ఆర్.కె.జి. నరసింహారావు (శివ) వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల అనకాపల్లిలో జరిగిన సమావేశంలో తనకు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసచార్యులు నియామక పత్రం అందించినట్లు సోమవారం ఆయన తెలిపారు. సంఘ ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.వి. ప్రసాద్, తాళ్లపాలెం ఆరోగ్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

### ఈదురుగాలులతో వర్షం

**కె.కోటపాడు :** మండలంలో పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వారాడ, ఆనందపురం, ఎ.కోడూరు, ఆర్.వై. అగ్రహారం గ్రామాల్లో మధ్యాహ్నం ఒక్కసారి గా ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఈ వర్షంతో సాగులో ఉన్న వరిపంటకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| దేవర | : రాజా |
| రామనగర్ బన్నీ | : సత్యనారాయణ స్క్రీన్-1 |
| మిస్టర్ సెలబ్రెటీ | : సత్యనారాయణ స్క్రీన్-2 |
| కాళి | : పర్తిసాయి |
| సత్యం సుందరం | : షిర్డిసాయి |
| దక్షిణ | : వెంకటేశ్వర |
| మన్మథ | : శ్రీసత్య |
| శ్వాగ్ | : రామచంద్ర |

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 307 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | 4,550 | 5,260 |
| రెండో రకం | 3,600 | 4,580 |
| మూడోరకం | 3,150 | 3,390 |

### రక్త నిల్వలు

**అనకాపల్లి:** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-26 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాటిజివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లి:** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 359 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 326 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



# బోధన ఎలా?



పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బోధిస్తున్న కార్యకర్త

- నేటి వరకూ అందని పాఠ్యపుస్తకాలు
- ఇబ్బంది పడుతున్న చిన్నారులు, కార్యకర్తలు
- అంగన్‌వాడీలను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం

**అనకాపల్లి:** పేద, మధ్య తరగతి పిల్లలు నష్టపోకూడదని ప్రైవేట్ స్కూళ్లలోని ఎల్‌కేజీ, యూకేజీ తరహాలో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్‌గా మార్చుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందుకు భిన్నంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. బాల్య దశలోనే పిల్లలకు గట్టి పునాదులు వేసే అంగన్‌వాడీ వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోంది. పాఠశాలలు ప్రారంభమైన నాలుగు మాసాలైన ఇంతవరకూ పాఠ్యపుస్తకాల పంపిణీ చేయకపోవడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

**గత ప్రభుత్వంలో నాణ్యమైన విద్య...**

చిన్నారులు విజ్ఞానంతోపాటు ఆంగ్లంపై పట్టు సాధించేందుకు వైఎస్సార్‌సీపీ పాలనలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించేందుకు పుస్తకాలను పంపిణీ చేసింది. కూటమి ప్రభుత్వంలో ఈ విధానికి మంగళం పాడుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించి నాలుగు మాసాలు గడుస్తున్నా నేటికీ ప్రీ స్కూల్ పిల్లలకు పుస్తకాలను పంపిణీ చేయలేదు. దీంతో పాత పుస్తకాలు, కిట్లతోనే అంగన్‌వాడీ కార్యకర్తలు బోధన కొనసాగిస్తున్నారు.

**నియోజకవర్గంలో...**

అనకాపల్లి నియోజకవర్గంలో ఐసీడీఎస్ పరిధిలో 234 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. జీవీఎంసీ పరిధిలో 81, అనకాపల్లి మండలంలో 84, కశింకోట మండలంలో 69 అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు చదువుకుంటున్నారు. 0 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలు నియోజకవర్గంలో 13,176 మంది ఉన్నారు. 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలు 1,810 మంది ఉండగా, వీరు అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నారు. చిన్నారులకు కేంద్రాల్లో కథలు చెప్పడం, సృజనాత్మక క్రియలు, యాక్షన్ పాటలను బోధిస్తారు. ఈ ఏడాది పాత పుస్తకాలు, కిట్లతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

**కానరాని నాణ్యమైన బోధన...**

వైఎస్సార్‌సీపీ పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల మాదిరిగా బోధన అందించేవారు. బోధనకు బర్డ్స్-1 కిట్లను అందజేసేవారు. నాలుగేళ్లలోపు చిన్నారులకు ఇంగ్లిష్, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్ యాక్టివిటీ, డ్రాయింగ్‌కు సంబంధించిన ఐదు రకాల పుస్తకాలతో కూడిన పీపీ-1 కిట్లను, ఐదేళ్లలోపు చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-2 కిట్లను పంపిణీ చేసేవారు. పిల్లలకు బోధన సులభంగా అర్థమయ్యే రీతిలో సాగేది. కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన బోధన కానరాలేదు. పాత పుస్తకాలతోనే బోధన చేయాలని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేసింది.

**ప్రైవేటు స్కూళ్లకు లబ్ధి చేకూర్చేలా...**

కూటమి ప్రభుత్వం పుస్తకాలకు స్వస్తి చెప్పి, మరలా పాత పద్ధతిలోనే అమలు చేసే విధంగా చర్యలు చేపట్టేందుకు పావులు కదుపుతోంది. చిన్నారులు ప్రీస్కూల్ ఎక్కడ చేరితే అక్కడే ఉన్న పాఠశాలల్లో విద్యార్థిగా కొనసాగే అవకాశం ఉంది. అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేస్తే పిల్లలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దశలు వారీగా బోధన కొనసాగిస్తారు. ఇది ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు లాభం చేకూర్చుతుంది.

## అంగన్‌వాడీ యాప్‌లను రద్దు చేయాలి

సీడీపీవో ప్రభావతికి వినతి



సీడీపీవో ప్రభావతికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

**అనకాపల్లి:** అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు తీసుకువచ్చిన యాప్‌లన్నీ కలిపి ఒకే యాప్‌గా మార్పు చేయాలని, రికార్డు వర్కు తగ్గించాలని, ఏడు నెలల నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ఏఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) డివిజన్ నాయకులు కె.తనూజ, క్యోతి, వరలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక సీడీపీవో కార్యాలయంలో సోమవారం సీడీపీవో పి.ప్రభావతికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు లబ్ధిదారుల జాబితాను పోషణ ట్రాకర్ యాప్, బాల సంజీవిని యాప్‌లో నమోదు చేస్తున్నామని, గర్భిణులు, బాలింతలకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా టి.హెచ్.ఆర్ అందిస్తున్నామని, మరలా ఐదు రకాల రికార్డుల రాయాలని ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం రికార్డులు ఇవ్వలేదని, ఒక్కొక్కరు రూ. వెయ్యి నుంచి రూ.1200 ఖర్చు పెట్టుకుని రికార్డులు కొనుగోలు చేయడం వల్ల ఆర్థిక భారంగా మారిందన్నారు. రెండు రకాల పనులు చెయ్యడం వలన పనిభారం పెరిగిందని, ఫోన్లు సక్రమంగా పనిచేయటం లేదని, కొన్ని ప్రాంతాల్లో నెట్ సిగ్నల్స్ లేనందు వల్ల యాప్‌ల వినియోగానికి ఇబ్బందులకు గురవుతున్నామని, కొత్తగా ఏడు నెల ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ఫొటోలు ఇవ్వాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. రకరకాల పనుల వల్ల ప్రీ స్కూల్ పిల్లల్లకు సకాలంలో బోధన ఇబ్బందిగా ఉందన్నారు. 42 రోజుల సమ్మె కాలంలో అంగీకరించిన విధంగా జీతాలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామల, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టపడి చదువుకుంటే ఉన్నత శిఖరాలు



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

**అనకాపల్లి:** కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవడంతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. స్థానిక గవరపాలెం కొణతాల సుబ్రహ్మణ్యం ఏసీ హాల్లో(గౌరీ సేవా సంఘం) ఆదివారం రాత్రి పదో తరగతి నుంచి వివిధ కోర్సుల్లో ప్రతిభావంతులైన 30 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాక ముందే విద్యకు, వైద్యానికి ప్రధాన పాత్ర ఇవ్వాలని అప్పటి పెద్దలు వర్తక సంఘం ద్వారా డిగ్రీ, కాలేజీ, ప్రసూతి ఆస్పత్రి నిర్మించారన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు లలిత కళలు, భరతనాట్యం, యోగా వంటి కార్యక్రమాలు నేర్పించాలని కోరారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం పెద్దలు మళ్ల సాంబశివరావు, ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నిధుల వినియోగంపై కేంద్ర కమిటీ ఆరా



సత్యవరంలో పింఛనుదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

**మాడుగుల :** మండలంలోని సత్యవరం గ్రామంలో నేషనల్ లెవెల్ మోనిటరింగ్ కమిటీ (ఎన్ఎల్ఎం) సోమవారం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై సర్వే చేసింది. పింఛను లబ్ధిదారులతో మాట్లాడి సామాజిక పింఛన్లు ఎలా అందుతున్నదీ తెలుసుకున్నారు. ఉపాధి పథకంలో నిర్మాణం జరిగి న భవనాలు, రోడ్లు పనుల సమాచారం సేకరించారు. డ్వాక్రా సభ్యులకు అందుతున్న రుణాలు, వాటి వినియోగంపై లబ్ధిదారులను అడిగితెలుసుకున్నారు. సత్యవరంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు సక్రమంగా కొనసాగుతున్నాయని కేంద్ర కమిటీ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అనిల్ గైక్వాడ్, అనిల్ నింబోర్కర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్, శ్రీనివాస్, సర్పంచ్ నాగమణి రామారావు, ఎంపీటీసీ తలారి అప్పారావు పాల్గొన్నారు.

**నారాయణరాజుపేటలో..**

**మాకవరపాలెం :** కేంద్ర నిధుల వినియోగంపై నేషనల్ లెవల్ మానిటరింగ్ (ఎన్ఎల్ఎం) కమిటీ ఆరా తీసింది. సోమవారం సాయంత్రం నారాయణరాజుపేటలో ఈ కమిటీ పర్యటించింది. గ్రామంలోని ప్రజలతో కమిటీ సభ్యులు అనిల్ నింబోర్కర్, అనిల్ గైక్వాడ్ సమావేశం అయ్యారు. ఉపాధి హామీ పనులు, కేంద్ర పథకాల అమలు, లబ్ధిపై అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా మహిళలకు అందుతున్న రుణాల వినియోగంపైనా మాట్లాడారు. ఉపాధి పనులను 100 రోజుల నుంచి 150 రోజులకు పెంచాలని కోరారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు.

## ఏనుగుతునిలో దసరా సంబరాలు



బాణాలు ఎక్కు పెట్టిన విద్యార్థులు

**కశింకోట:** ఏనుగుతుని గ్రామంలో విద్యార్థులు సోమవారం దసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాలు పట్టుకొని గ్రామ పెద్దలతో పాటు కలిసి ఇంటింటికీ వెళ్లి సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు అంటూ దసరా పాటలు పాడారు. బాణాలతో ఇళ్లలోకి పూలు, ఆకులు వేసి సంబరాలు చేశారు. హెచ్ఎం శర్మ, స్కూలు కమిటీ చైర్మన్ ఈశ్వరరావు, వైస్ చైర్మన్ స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు



ఇసుక తవ్వకాలు జరగకుండా జేసీబీతో కాలువు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**గొలుగొండ :** చోద్యం వద్ద బొడ్డేరు గెడ్డ వద్ద ఇసుక అక్రమ రవాణా జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ ఆదేశాల మేరకు చోద్యం వద్ద ఉన్న భారీ వంతెన వద్ద ట్రాక్టర్లు, ఎడ్ల బళ్లు రాకుండా పెద్ద కాలువ ఏర్పాటు చేశారు. వంతెన వద్ద ఇసుక తవ్వకాలు జరగడం వల్ల వంతెనకు ముప్పు ఉందని పలువురు పోలీస్, రెవెన్యూ అధికారులకు తెలపడంతో ఈ వంతెన వద్ద ఇసుక అక్రమ రవాణా జరగకుండా పెద్ద కాలువలు ఏర్పాటు చేశారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.



రాజరాజేశ్వరిదేవి అవతారంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో సతకంపట్టు కనకదుర్గమ్మ



కశింకోటలో మహా చండీదేవి అవతారంలో కనకదుర్గ అమ్మవారు



లలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో సత్యనారాయణపురం కనకదుర్గమ్మ



అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధనలో భక్తులు

# అమ్మ దర్శనం.. భక్తజన పరవశం

- దుర్గాదేవి ఆలయాల్లో విశేష పూజలు
- వేడుకగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**నియోజకవర్గ వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా దుర్గాదేవి వివిధ అలంకరణలో దర్శనమివ్వగా, వేకువ జాము నుంచే భక్తులు అమ్మవారి సేవలో తరిస్తున్నారు. సకల సౌభాగ్యాలు ప్రసాదించాలని వేడుకుంటున్నారు. పలు చోట్ల అన్నసమారాధనలు ఏర్పాటు చేయగా, గవరపాలెంలో సారె ఊరేగింపు వేడుకగా జరిగింది.**



వివిధ రకాల పిండి వంటకాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తున్న భక్తులు

**అనకాపల్లి:** దసరా ఉత్సవాల్లో ఐదో రోజైన సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారి దేవాలయాలు, మండపాలు దేవీ నామస్మరణతో మార్మోగాయి. మహిళలు, భవానీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేపట్టారు.

**నూకాంబిక అమ్మవారి బాలాలయంలో..**

ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి బాలాలయంలో గణపతిపూజ, కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో శివలింగానికి ఉదయం 9 గంటలకు రుద్రాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయం వద్ద పిళ్లాసూర్య జనార్దనరావు, విజయలక్ష్మి, కర్రి అప్పారావు, లలితాజ్యోతి, ఎ.సుధీర్, హేమలత దంపతులు ఆర్థిక సాయంతో 1,500 మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాత్రి 7 గంటలకు అమ్మవారి ఆలయం వద్ద దీపాలంకరణ సేవ నిర్వహించారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

**లలితా త్రిపుర సుందరీదేవిగా..**

స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు భోగారపు వెంకటరమణ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, హోమాలు, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దంపతులు ఆర్థిక సాయంతో భవానీ భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తి రథయాత్రను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు పాల్గొన్నారు.

**వేడుకగా సారె ఊరేగింపు**

గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీదేవి అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు అంపోలు రాం ప్రసాద్ శర్మ, కోట శ్రీకర్ శర్మ, అంపోలు గోపాలకృష్ణ శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి ''సారె ఊరేగింపు'' కార్యక్రమాన్ని సాయంత్రం 5 గంటలకు పురవీధుల్లో నిర్వహించారు. అమ్మవారికి మహిళలు తయారు చేసిన వివిధ రకాల పిండి వంటకాలు నైవేద్యంగా సమర్పించి, భక్తులకు పంచిపెట్టారు. ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయు డు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, సభ్యులు పాల్గొన్నారు.

**అన్నపూర్ణా దేవి అవతారంలో కామాక్షిదేవి....**

స్థానిక నిదానందొడ్డిలో కామాక్షమ్మ ఆలయంలో అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, కమిటీ ఉపాధ్యక్షుడు శౌంత్యాణ సతీష్, కోశాధికారి ధవలేశ్వరం లక్ష్మణరావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అన్నపూర్ణాదేవి అవతారంలో కామాక్షిదేవి

**రాజరాజేశ్వరిదేవి అవతారంలో**

స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం బేడసేవ, శ్రీచక్ర అభిషేకాలు, నక్షత్ర హారతి, గోపూజ వంటి కార్యక్రమాలు చేపట్టారు. కన్యకాపరమేశ్వరి హరి భజన మండలి వారిచే కోలాట నృత్య ప్రదర్శన నిర్వహించారు. ప్రతిష్ట శత జయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపాలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు పాల్గొన్నారు.



నూకాంబిక అమ్మవారి బాలాలయంలో శివలింగానికి రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

**సత్యనారాయణపురంలో..**

సత్యనారాయణపురంలో కనకదుర్గ కొండపైన అమ్మవారు భక్తులకు లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకుడు రేజేటి ధర్మాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారు జామునుంచి పంచామృత అభిషేకాలు, హోమం, కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం భవానీ భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు యడ్ల త్రినాథ్‌రావు, ఆలయ ధర్మకర్త బోయిన రమణాజీ, చైర్మన్ మేడిశెట్టి రామసత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి వెంకట రమణ కిషోర్, గౌరవాధ్యక్షుడు పలకా సత్యనారాయణ, అన్నదానం ట్రస్ట్ చైర్మన్ దుడ్డు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**మహా చండీదేవిగా...**

**కశింకోట:** స్థానిక కనకదుర్గ ఆలయంలో సోమవారం మహా చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు చండీదేవిగా అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు ఎక్కువగా దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.ప్రసాద్‌బాబు పర్యవేక్షించారు. స్థానిక శివాలయంలో సర్వమంగళాంబకు ప్రత్యేక అలంకరణ, పూజలు, సహస్ర నామార్చనను అర్చకుడు వి. చిదంబరం నిర్వహించారు. భక్తులు ఎక్కువగా దర్శించారు.



అన్నపూర్ణాదేవి అవతారంలో గౌరీదేవి



సారె ఊరేగింపులో పాల్గొన్న భక్తులు